క్లుప్తంగా

లాజర్‌కు నివాళులర్పించిన అబ్బయ్యచౌదరి



బత్తుల లాజర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అబ్బయ్యచౌదరి

పెదవేగి : చిన్న వయస్సులో అనారోగ్యంతో మరణించిన లాజర్ లేని లోటు ఆయన కుటుంబంతోపాటు వైఎస్సార్‌సీపీకి తీరని లోటని దెందులూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం రాట్నాలకుంటలో ఇటీవల మరణించిన బత్తుల లాజర్ ఇంటికి అబ్బయ్యచౌదరి శనివారం వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. లాజర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బ్రహ్మేశ్వరరావుకు పరామర్శ



బ్రహ్మేశ్వరరావును పరామర్శిస్తున్న వాసుబాబు

గణపవరం: పెదనింఁద్రకొలను సొసైటీ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు చినిమిల్లి బ్రహ్మేశ్వరరావు సతీమణి వెంకటలక్ష్మి మృతికి మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సంతాపం వ్యక్తం చేశారు. శనివారం గణపవరంలో బ్రహ్మేశ్వరరావు కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. వెంకటలక్ష్మి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా సంఘం మాజీ చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గంటా పద్మాజీ, గాజుల బుజ్జి, పసుపులేటి నాగేశ్వరరావు ఉన్నారు. నిడమర్రు గ్రామానికి చెందిన బండారు సత్యం ఇటీవల మరణించగా ఆయన కుటుంబ సభ్యులను వాసుబాబు శనివారం పరామర్శించారు. ఈయనవెంట పార్టీ నాయకులు బండారు నాగరాజు, పోలిశెట్టి రమేష్ తదితరులు ఉన్నారు.

గ్రామీణ తపాలా జీవిత బీమా ఒక వరం

ఏలూరు (టూటౌన్): గ్రామీణ తపాలా జీవిత బీమా వినియోగదారులకు ఒక వరమని ఏలూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్ శ్రీకర్ బాబు అన్నారు. స్థానిక సత్రంపాడులోని పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో శనివారం ఆయన తన సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. తక్కువ ప్రీమియం ఎక్కువ బోనస్సు, ట్యాక్స్ మినహాయింపు ఉన్న తపాలా జీవిత బీమా ప్రీమియం చిన్న మొత్తాల పొదుపులో వినియోగదారుల పాలిటి కల్పతరువుగా అభివర్ణించారు. రానున్న రోజుల్లో గ్రామీణ తపాల జీవిత బీమా ప్రీమియం విరివిగా సేకరించి, ప్రజలందరికీ కేంద్ర ప్రభుత్వ సంస్థ నుంచి బీమాను కల్పించాలని కోరారు.

'సూపర్ సిక్స్' అమలుకు డిమాండ్

ఏలూరు (టూటౌన్): ప్రభుత్వాలు డైవర్ట్ పాలిటిక్స్ ఆపి ప్రజలకు సూపర్ సిక్స్ పేరిట ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ డిమాండ్ చేశారు. సీపీఎం ప్రజాపోరు యాత్ర ఏలూరు 2 టౌన్ ప్రాంతంలో శనివారం నిర్వహించారు. తంగెళ్లమూడి తాపీ మేస్త్రి కాలనీ, కుమ్మరి రేవు, లంకపేట, రాణి నగర్, ఇజ్రాయిల్ పేట, ముస్లిం బజార్, కండ్రిక గూడెం, చోడిదిబ్బ ప్రాంతాల్లో కిషోర్ మాట్లాడారు. ఇసుక కొరత కారణంగా నిర్మాణ రంగం ఇబ్బందులు ఎదుర్కొంటోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తీసుకొచ్చి ఊరూరా బెల్ట్ షాపులు పెట్టిందని విమర్శించారు. నిత్యావసర ధరలను అరికట్టడంలో విఫలమైందన్నారు. ఏలూరు నగరంలో శివారు ప్రాంతాల్లో ఇళ్ల పట్టాలు, రోడ్లు, డ్రైయినేజీలు, వీధిలైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కుక్కలు, దోమలు, పందులు బెడద ఎక్కువగా ఉందని తెలిపారు. నగరంలో ట్రాఫిక్ , వర్షాకాలంలో డ్రైయినేజీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రజలకు మున్సిపల్ కార్పొరేషన్ ఆర్‌ఓ సిస్టం ద్వారా రూ.2కే 20 లీటర్లు మినరల్ వాటర్ ప్రతి ఇంటికీ అందించాలని డిమాండ్ చేశారు.

రూ.6.44 కోట్ల ధాన్యం కొనుగోలు

ఏలూరు(మెట్రో): ఈ నెల 8వ తేదీ వరకు రూ.6.44 కోట్లు విలువైన 2793.680 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 333 మంది రైతుల నుంచి 39 రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి, రైస్ మిల్లుకు తరలించినట్టు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. భీమడోలు మండలంలో ఆన్‌లైన్ కొనుగోలు ప్రక్రియ ప్రకారం నేటి వరకు రూ.76 లక్షల విలువైన 330.440 మెట్రిక్ టన్నుల ధాన్యం 37 మంది రైతుల నుంచి 9 రైతు సేవా కేంద్రాల ద్వారా కొన్నట్టు చెప్పారు. ధాన్యం కొనుగోలులో సందేహాలుంటే జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ (కంట్రోల్ రూమ్ నంబర్లు 08812 230448, 77020 03584, టోల్ ఫ్రీ నంబర్ 18004256453) ఏర్పాటు చేశామని తెలిపారు.

కొబ్బరి ధర డీలా.. రైతులు విలవిల



ధర లేక రాసులుగా పోసిన కొబ్బరికాయలు



కొబ్బరి కాయలు ఒలుస్తున్న కార్మికులు

- సాగు చేసిన వారికి ప్రయోజనం శూన్యం
- దళారులకే లాభం

పెదవేగి : కల్పవృక్షం కంట తడి పెట్టిస్తోంది. కనీస పెట్టుబడులు సైతం రాక ఈ పంట సాగు చేస్తున్న రైతులంతా దిగులు చెందుతున్నారు. డెల్టా ప్రాంతంలో వరి పంట తరువాత అంత ప్రాధాన్యత సంతరించుకున్న కొబ్బరి సాగు కొన్నేళ్లుగా సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. కొన్ని నెలలుగా కొబ్బరి ధర స్థిరంగా లేకుండా హెచ్చుతగ్గుల మధ్య నడుస్తోంది. దీంతో ఈ పంట సాగుపై రైతుల్లో అనాసక్తి వ్యక్తమవుతోంది. దెందులూరు నియోజకవర్గ వ్యాప్తంగా పెదవేగి మండలంలో 10,570 వేల ఎకరాల్లో, దెందులూరులో 1,428, పెదపాడులో 275, ఏలూరు రూరల్ మండలంలో 213 ఎకరాల్లో కొబ్బరిని రైతులు సాగుచేస్తున్నారు. కాలువ గట్లపై, ఖాళీ స్థలాల్లో, ఇళ్ల ముందు అనేకంగా కొబ్బరి చెట్లు ఎక్కువ మందికి ఆదాయ మార్గంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో కొబ్బరి ధరపై అంతా ఆశలు పెంచుకున్నారు.

భారీగా ధర పతనం

ఒకానొక దశలో రైతుకు చెట్టు వద్దే కొబ్బరి కాయకు దాదాపు రూ.13 నుంచి రూ.15 వరకు లభించింది. కాని ఇప్పుడున్న పరిస్థితుల్లో కొబ్బరికాయ ధర కేవలం రూ.6 నుంచి రూ.8 పలుకుతోంది. రైతులకు ఖర్చులు పోను రెండు రూపాయలు మాత్రమే మిగులుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధర భారీగా పతనమవడంతో రైతులు డీలా పడుతున్నారు. ఇతరప్రాంతాల్లో మన కొబ్బరి కాయలకు అంతగా మార్కెట్‌లేదని సాకు చూపుతూ ఇక్కడి వ్యాపారులు స్థానిక రైతులను మభ్యపెడుతున్నారు.

దింపుడు కూలీ ఒక్కోకాయకు రూ.1.30

కొబ్బరి కాయ దిగుబడి ఆశాజనకంగా ఉన్నా మద్దతు ధర లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. కాయకు రూ.1.30 పైసలు చొప్పున దింపు కూలీ చెల్లించాల్సి వస్తోంది. కొన్ని చోట్ల చెట్టుకు నాలుగు కాయలున్నా, నలభై కాయలున్నా రూ.100 చొప్పున దింపుడు కూలి చెల్లించాల్సి రావడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ రెండు విధానల్లోనూ రైతుకు నష్టం తప్పడం లేదు. దింపు కార్మికుల కొరత కారణంగా వారికి గిరాకీ నడుస్తోంది. దీంతో దింపుడు రేటు భరించలేక కొందరు చెట్ల పైనే కాయలు ఉంచేస్తున్నారు. కొందరు రెండు మూడు నెలలకోసారి కొబ్బరి కాయలు తీయిస్తున్నారు. మరికొందరు మార్కెట్‌లో ఎప్పుడు రేటు పెరుగుతుందా అని ఆశగా ఎదురు చూస్తున్నారు. రానున్నవి పండగ రోజులు, ఈ నేపథ్యంలోనైనా కొబ్బరి కాయ రేటు పెరుగుతుందని రైతులు ఆశపడుతున్నారు. కాగా ఇప్పటికే టోకు వర్తకులు లక్షల రూపాయలు ఖర్చు చేసి కొబ్బరి కాయలు పోగు చేయడంతో వారికి ఎక్కువ లాభం చేకూరనుంది.

మార్కెట్ మాయ

సగటు రైతును కొబ్బరి మార్కెట్ నిలువెల్లా మోసం చేస్తోంది. అంకెలు, మాటల గారడీలో వారిని దళారీలు మాయ చేస్తున్నారు. ముఖ్యంగా టోకు వర్తకులు సన్నకారు రైతులను అందినకాడికి దోచేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న పలువురు టోకు వర్తకులు ఇటీవల ఒక సిండికేట్‌గా మారి రైతులకు గిట్టుబాటు ధర లేకుండా చేస్తున్నారు. పైగా వారిలో కొందరు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే పెద్దఎత్తున కొబ్బరి కొనుగోలు, అమ్మకాలు సాగిస్తున్నారు. మరికొందరు వ్యాపారులు చిన్న తరహా పరిశ్రమగా అనుమతి పొంది పన్ను ఎగవేస్తూ లక్షల్లో కొబ్బరి కాయలను నిల్వ చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తున్నారు. గోదాముల్లో కొబ్బరి తోటల్లో విచ్చలవిడిగా కాయలను రాశులుగా పోస్తున్నారు. అనధికార వ్యాపారులపై అధికారులు దాడులు జరిపితే రైతులకు కొంత వరకైనా న్యాయం జరుగుతుంది.

రైతులను ఆదుకోవాలి

నిమ్మకాయ జామకాయ ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. అలాంటిది ఎంతో శ్రమపడి, పెట్టుబడితో పండిస్తున్న కొబ్బరికి మార్కెట్‌లో విలువలేకుండా పోయింది. ఈ పరిణామం కొబ్బరి సాగు ఉనికికే ప్రమాదం. రైతులు అపారంగా నష్టపోతున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– చిలక వెంకటేశ్వరరావు, కూచింపూడి రైతు

మార్కెట్‌ను ప్రభుత్వం నియంత్రించాలి

కొబ్బరి పంట మానవ జీవితంలో అనేక అవసరాలు తీరుస్తుంది. కాయ సైజు, మచ్చ పేరుతో వ్యాపారుల చేతుల్లో కొబ్బరి రైతులు దశాబ్దాలుగా మోసపోతున్నారు. ప్రభుత్వ నియంత్రణలేక టోకు వర్తకులు అసలైన సాగుదారులను దోపిడీ చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ రంగంపై ప్రభుత్వ నియంత్రణ అవసరం.

– కొండేటి శ్రీనివాస్, రైతు గోపన్నపాలెం

14 నుంచి క్షేత్రస్థాయిలో క్యాన్సర్ పరీక్షలు

పెదవేగి : పెదవేగి, విజయరాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జాతీయ క్యాన్సర్ డే సందర్భంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్టు విజయరాయి, పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ మాధవి తెలిపారు. ఈ నెల 14న పెదవేగి మండలంలో క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ నిర్వహిస్తున్న సర్వేని లాంఛనంగా ప్రారంభిస్తామని వారు చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి క్యాన్సర్‌తోపాటు వ్యాధుల వ్యాప్తిపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని వైద్యాధికారులు వివరించారు.అన్ని గ్రామాల్లోని ప్రజలకు ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్, పాఠశాలల ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు, అంగన్‌వాడీ పిల్లలకు పూర్తిస్థాయి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. క్యాన్సర్‌పై నిర్వహించే అవగాహన సదస్సులు, ర్యాలీలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డాక్టర్లు కోరారు. మండలంలో ఈ అవగాహన కార్యక్రమాలు 9 నెలల పాటు కొనసాగుతాయని చెప్పారు. పెదవేగి మండల ప్రజలు క్యాన్సర్‌పై వైద్య సిబ్బంది నిర్వహించే సర్వేకు పూర్తిగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోండి

దెందులూరు: పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు అవసరమైన డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ కోసం తల్లిదండ్రులు సచివాలయంలో సంప్రదించాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నేత కందుల రమేష్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రచారంలో భాగంగా శనివారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ సమీపంలోని సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వారు అందజేసిన రసీదును ఎంఈఓ ద్వారా తహసీల్దార్‌కు పంపిస్తే వేగంగా డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ మంజూరవుతుందన్నారు. ఆ డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ ప్రకారం పేరుతోపాటు ఇతర వివరాలు మార్పు చేసుకోవచ్చని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యావంతులు ఎన్జీవోలు, రిటైర్డ్ ఉద్యోగులు ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు.

వైభవంగా అమ్మవార్ల వార్షికోత్సవం



భీమడోలులో అమ్మవార్లకు పూజలు చేస్తున్న భక్తులు

భీమడోలు: భీమడోలులోని గ్రామదేవతల 16వ వార్షికోత్సవ వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏటా లోక కల్యాణార్థం, గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన ఈ ఉత్సవంలో గ్రామం పరిధిలోని మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి గ్రామ దేవతలు మద్దిరావమ్మ, మహాలక్ష్మమ్మ, గంగానమ్మ ఆలయాల్లో విశేష పూజలు చేశారు. భక్తులు చలివిడి పానకాలను అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రాంగణం వద్ద పోతురాజు విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు దత్తాడ శ్రీనివాసరాజు మహిళలకు చీరలు, జాకెట్ ముక్కలు, గాజులు అందించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ వచ్చే ఏడాది ఫిబ్రవరి 8 నుంచి మార్చి 9వ తేదీ వరకు 12 ఏళ్లకు వచ్చే జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు.

రికవరీ సొమ్ము బాధితులకు అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు నగదును అందజేస్తున్న సీఐ యూజే విల్సన్, ఎస్సై వై.సుధాకర్

భీమడోలు: భీమడోలు జంక్షన్‌లో ఇటీవల జరిగిన చోరీ ఘటనలో నిందితుల నుంచి రికవరీ చేసిన సొమ్మును భీమడోలు పోలీసులు కోర్టు ఆదేశాల మేరకు శనివారం రూ.2.80లక్షలు బాధితులకు అందజేశారు. భీమడోలు సీఐ కార్యాలయంలో ఎస్సై వై.సుధాకర్‌తో కలిసి సీఐ యూజే విల్సన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ద్వారకాతిరుమల మండలం గుణ్ణంపల్లికి చెందిన చిరు వ్యాపారి తుమ్మలపల్లి మహేశ్వరరావు సెప్టెంబర్ 18న భీమడోలు గణపతి సెంటర్‌లోని స్టేట్‌బ్యాంకు వద్ద రూ.3 లక్షల వ్యాపార లావాదేవీల నిమిత్తం చెక్ విత్ డ్రా చేసి తన బ్యాగులో ఆ సొమ్మును భద్రపర్చుకుని మోటార్ సైకిల్‌పై వెళుతున్నాడు. భీమడోలు జంక్షన్‌లో ఆగి ఓ దుకాణంలోకి వెళ్లి బయటకు వచ్చి తన వాహనాన్ని స్టార్ట్ చేసే సమయంలో సొమ్ము అపహరించారని గ్రహించిన బాధితుడు మహేశ్వరరావు సీఐ యూజే విల్సన్, ఎస్సై వై.సుధాకర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ పర్యవేక్షణలో అదే నెల 23న చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను పట్టుకుని వారి నుంచి రూ.2.8 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆ సొమ్మును కోర్టు ఆదేశాల మేరకు భీమడోలు సీఐ కార్యాలయంలో బాధితులకు అందించారు. పోయిందనుకున్న సొమ్ము పోలీసుల కృషితో తమకు చేరిందని భార్యాభర్తలు కృతజ్ఞతలు తెలిపారు. డబ్బుల విషయంలో అజాగ్రత్తగా ఉండవద్దని సీఐ యూజే విల్సన్ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీ సూరిశెట్టి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు రంగం సిద్ధం



దెందులూరులో గ్రామ సచివాలయానికి ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్

దెందులూరు: కూటమి ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు కొత్త సంవత్సరం రాకముందే ఎలక్ట్రికల్ స్మార్ట్ మీటర్ రూపంలో షాక్ ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. సెల్‌ఫోన్ మాదిరిగా రీఛార్జి చేసుకుంటేనే ఈ ఎలక్ట్రికల్ స్మార్ట్ మీటర్ పనిచేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్‌కో శాఖకు ఇచ్చిన లిఖిత పూర్వక ఆదేశాల మేరకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రాథమిక దశలో ప్రభుత్వ కార్యాలయాలు, కమర్షియల్ కనెక్షన్లకు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ వినియోగదారులపై ధరల భారం పెంచమని ఎన్నికల ప్రచార సభల్లో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఇటీవల ధరలు పెంచి కరెంటు బిల్లులు జారీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. దీనికి తోడుగా ఎలక్ట్రికల్ స్మార్ట్ మీటర్లు విద్యుత్ వినియోగదారులకు గుదిబండగా తయారయ్యాయి. సూపర్ సిక్స్ పేరిట వివిధ పథకాలను అమలు చేస్తామంటూ విస్తృతంగా ప్రచారం చేసిన కూటమి ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ శాఖాధికారులు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుపై సమాచారం చెప్పడానికి ఇష్టపడటం లేదు. దెందులూరు నియోజకవర్గంలో దెందులూరు, పెదపాడు, పెదవేగి, ఏలూరు రూరల్ మండలాలున్నాయి. ఈ నాలుగు మండలాల్లో 3 లక్షలకుపైగా గృహ విద్యుత్ కనెక్షన్లున్నాయి. 3 లక్షలకు పైగా కమర్షియల్ (షాపులు) కనెక్షన్లున్నాయి. దాదాపు 3 వేలు ప్రభుత్వ కార్యాలయాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ శాఖాధికారులకు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ప్రయోగాత్మకంగా తొలి దశగా ప్రభుత్వ కార్యాలయాలకు, కమర్షియల్ షాపులకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటు కార్యక్రమాన్ని కాంట్రాక్ట్‌కు ఇచ్చినట్లు సమాచారం. గృహాలకు ఈ మీటరు బిగించేందుకు ఎప్పుడు అధికారిక ప్రకటన విడుదల చేస్తారో తెలియాల్సి ఉంది.

పట్టభద్రులంతా ఓటు నమోదు చేసుకోవాలి

గణపవరం: గణపవరం మండలంలోని పట్టభద్రులందరూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరుగా నమోదు కావాలని గణపవరం తహసీల్దార్ వైకేపీ అప్పారావు కోరారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు ఓటరు నమోదు దరఖాస్తులు శని, ఆదివారాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ స్వీకరిస్తారని తెలిపారు. అప్లికేషన్‌తోపాటు గెజిటెడ్ ఆఫీసర్ సంతకంతో అటెస్టెడ్ డిగ్రీ సర్టిఫికెట్ జెరాక్స్, ఆధార్ కార్డు, ఫొటో సమర్పించాలని సూచించారు.

నోటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

పెదవేగి : జాతీయ టూత్ బ్రషింగ్ డే సందర్భంగా పెదవేగి మండలం దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాలలో ప్రజాదంత ఆరోగ్య వైద్య విభాగం ఆధ్వర్యంలో జాతీయ టూత్ బ్రషింగ్ డే వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సెయింట్ పాస్కాలీ పాఠశాలలో విద్యార్థులకు నోటి ఆరోగ్యం, బ్రష్ చేసే విధానం, దంత వ్యాధులను అరికట్టడం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల్లో వినోదాత్మక కార్యక్రమాలను నిర్వహించారు. విజయవంతంగా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సహకరించిన సెయింట్ జోసెఫ్ యాజమాన్యం సెక్రటరీ, కరస్పాండెంట్ ఫాదర్ జి మోజెస్, అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ఫెలిక్స్, ప్రిన్సిపాల్ ఎస్ స్లీవరాజుకు దంత వైద్య విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పావన సంధ్య, స్టాఫ్ ప్రజాదంత వైద్య విభాగ హౌస్ సర్జన్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

15న కార్తీక పౌర్ణమి శివ క్షేత్ర దర్శన బైక్ యాత్ర



రామదండు ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్ విడుదల

దెందులూరు: దెందులూరు మండల రామదండు ఆధ్వర్యంలో ఈనెల 15న దెందులూరు శివాలయం వద్ద నుంచి కార్తీక పౌర్ణమి శివ క్షేత్ర దర్శన బైక్ యాత్ర ప్రారంభమవుతుందని రామదండు కమిటీ నాయకులు మొట్టపర్తి రాజా అన్నారు. శనివారం దెందులూరు నర్సింగ్ కళాశాలలో రామదండు కమిటీ సభ్యులు రాజేష్, నూకరాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాజా, నూకరాజు మాట్లాడుతూ పరమ పవిత్రమైన కార్తీక పౌర్ణమి రోజున 200 మంది బైక్ యాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఒకేరోజు ఆరు శివ క్షేత్రాల దర్శన భాగ్యం దెందులూరు గ్రామ శివారు ప్రాంత ప్రజలు భక్తులకు కలుగుతుందన్నారు. రామదండు ఆధ్వర్యంలో బైక్ యాత్ర నిర్వహిస్తున్నామని అయ్యప్ప స్వాములు, కమిటీ సభ్యులు గ్రామస్తులు భక్తులు ఈ మహత్తర కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. అనంతరం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అమల కుమారి, దేవినేని తులసీదాసు, భట్టాచార్య బ్రహ్మం, హేమంత్ దుబాయ్ శేటు, గౌడ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జీవన శైలిలో మార్పులు రావాలి



భీమడోలు కళాశాలలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న గైనకాలజిస్ట్ బాలజ్యోతి

భీమడోలు: వ్యక్తిగత పరిశుభ్రత, జీవన శైలిలో మార్పులు రావాలని, రుతుచక్రంలో వచ్చే అనారోగ్య సమస్యలపై యువతులు అవగాహన కలిగి ఉండాలని భీమడోలు ఆరోగ్యమాత జనరల్ ఆసుపత్రి గైనకాలజిస్ట్ జి.బాలజ్యోతి అన్నారు. భీమడోలులోని శ్రీమాధురి జూనియర్ బాలికల కళాశాలలో శనివారం యువతులు ఆరోగ్య పరిరక్షణకు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఇన్‌చార్జి పి.బాలు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బాలజ్యోతి మాట్లాడుతూ బాలికలు, యువతులు రుతుచక్రం సమయంలో అనారోగ్యం బారిన పడతారని, వాటిపై సంపూర్ణ అవగాహన కలిగి ఉంటే సమస్యలను అధిగమించవచ్చని అన్నారు. నేటి సమాజంలో మహిళల్లో సర్వేకల్ క్యాన్సర్ ఎక్కువగా కనిపిస్తోందని, ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నివారణ సాధ్యమవుతుందన్నారు. ఇంటింటికీ వైద్య సిబ్బంది వెళ్లి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేపడుతున్నందున ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత కర్రే ప్రేమ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ కేసరి, అధ్యాపకులు భువనేశ్వరి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ధ్యానం, శాకాహారంతో ఆరోగ్యం




పూళ్లలో ర్యాలీలో పాల్గొన్న శాకాహార ప్రియులు, పిరమిడ్ సేవాదళ్ సభ్యులు

భీమడోలు: ధ్యానం, శాకాహారం సకల రోగ నివారణి అని సీనియర్ పిరమిడ్ టీచర్ ఎం.వరలక్ష్మి అన్నారు. పిరమిడ్ సేవాదళ్ మండల అధ్యక్షుడు అప్పన్న ఆధ్వర్యంలో శనివారం కురెళ్లగూడెం, పూళ్ల గ్రామాల్లో శాకాహార ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. శాకాహార ప్రియులు, సేవాదళ్ సభ్యులు భారీ సంఖ్యలో శాకాహార ర్యాలీ నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో మాంసాహారం మానాలి, బుద్ధుని అహింసా మార్గం అనుసరించాలి, అందరూ శాకాహారం భుజించాలంటూ ప్లకార్డులను చేత పట్టుకుని నినాదాలు చేశారు. సీనియర్ పిరమిడ్ మాస్టార్లు వరలక్ష్మి ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ జంతువుల పట్ల ప్రేమ కలిగి ఉండాలని, సుభాష్ పత్రీజీ జయంతిని పురస్కరించుకుని వాడవాడలా ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 11న పత్రీజీ పుట్టిన రోజును పురస్కరించుకుని వాడవాడలా అవగాహన సదస్సులు నిర్వహించారు. శాకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారన్నారు. మాంసాహారం భుజిస్తే ఆయుష్షు తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పంట్ల రాము, అనుపోజు పాండురంగారావు, మద్దుల వెంకటేశ్వరరావు, లక్ష్మీ, రాము పాల్గొన్నారు.

జిల్లా కేంద్రాల్లోనే శిక్షణ శిబిరాలు

దెందులూరు: ఉపాధ్యాయులకు స్కూల్ లీడర్ షిప్ ట్రైనింగ్ ఇకపై జిల్లా కేంద్రాల్లోనే నిర్వహించనున్నట్టు స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హామీ ఇచ్చారని డీఎఫ్‌టీ రాష్ట్ర కార్యదర్శి కలపాల సురేష్‌కుమార్ అన్నారు. శనివారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో విజయవాడలో స్టేట్ పాజిటివ్ డైరెక్టర్‌ను కలిసి ఉపాధ్యాయుల స్కూల్ లీడర్‌షిప్ ట్రైనింగ్‌ల నిర్వహణలో ఎదుర్కొంటున్న ఇబ్బందులు వివరించడంతో పాటు ఇటీవల జరిగిన బాధాకరమైన సంఘటనపై వినతిపత్రం ఇచ్చామన్నారు. క్షుణ్ణంగా పరిశీలించిన స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇకపై జరిగే అన్ని కార్యక్రమాలు జిల్లా హెడ్ క్వార్టర్స్‌లోనే నిర్వహిస్తామని హామీ ఇచ్చారని ఉపాధ్యాయుల భద్రత భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని డీఎఫ్‌టీ రాష్ట్ర కార్యదర్శి కలపాల సురేష్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

కల్యాణికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



టీచర్ బీఎస్ఎన్‌కే కల్యాణి

దెందులూరు: ఏలూరు జిల్లా దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న బీఎస్ఎన్‌కే కల్యాణికి ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును శనివారం ప్రకటించింది. ఈమె ఎంఏ ఎంఎస్సీ, ఎంఫిల్, బీఈడీ విద్యను పూర్తి చేశారు. విద్యారంగంలో తనదైన శైలిలో బోధన ద్వారా విద్యార్థుల్లో గుణాత్మక మార్పును తీసుకువచ్చి, సాంఘిక అంశాల పట్ల పిల్లల్లో చైతన్యాన్ని కలిగించినందుకు పాఠశాల సహచర ఉపాధ్యాయులు, హెచ్ఎం, డీఈఓ సిఫార్సు మేరకు ఈ ఏడాది కల్యాణికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కల్యాణి ప్రథమస్థానంలో నిలిచింది. అప్పటి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చేతుల మీదుగా ఆమె జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు పొందారు. కల్యాణి తాతయ్యలు ఇద్దరూ, తల్లి బి నాగలక్ష్మి, తండ్రి బి శేషగిరిరావు, మామయ్య సత్యనారాయణ రిటైర్డ్ టీచర్లు. భర్త కేఎస్‌వీకే రాజకుమార్ గణిత ఉపాధ్యాయుడిగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్నారు.

మెరుగైన సేవలు అందించాలి

ఏలూరు టౌన్: రోగులకు మెరుగైన సేవలందించాలని ఏలూరు సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎంఎస్ రాజు అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన శనివారం ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు.రోగులు, వారి బంధువులతో మాట్లాడారు.